క్లుప్తంగా

నిస్వార్థ సేవకులు ఉగ్రవాదులా?


బియ్యపు మధుసూదన్‌రెడ్డి, ఎమ్మెల్యే, శ్రీకాళహస్తి

శ్రీకాళహస్తి: నిస్వార్థంగా ప్రజలకు సేవ చేస్తున్న వలంటీర్లపై టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జల సుధీర్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు బాధాకరమని ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ నిత్యం ప్రజల్లో ఉండి, నిస్వార్థంగా సేవ చేసే వలంటీర్లను ఆయన ఉగ్రవాదులతో పోల్చడం సరికాదన్నారు. కరోనా కష్టకాలంలో బొజ్జల సుధీర్‌రెడ్డి హైదరాబాద్‌లో కూర్చుని చికెన్ చేసుకుంటూ వీడియోలు పెడుతుంటే... వలంటీర్లు తమ ప్రాణాలను ఫణంగా పెట్టి ఇంటింటికీ తిరిగి సేవలందించారని గుర్తుచేశారు. నేడు వలంటీరు వ్యవస్థ ఉంది కాబట్టే వృద్ధులు, వికలాంగులకు నేరుగా 1వ తేదీకల్లా పింఛను అందజేస్తున్నారన్నారు. ప్రజలకు కావాల్సిన ధ్రువపత్రాలు వంటి వాటి కోసం కష్టపడుతున్నారని చెప్పారు. ప్రజలకు సేవ చేసే వలంటీర్లను టెర్రరిస్టులు అంటే నాలుగున్నర సంవత్సరాలు హైదరాబాద్‌లో కూర్చుని తీరిగ్గా ఎన్నికల సమయంలో ప్రజలకు మాయ మాటలు చెప్పే బొజ్జల సుధీర్‌రెడ్డిని ఏమనాలి..? అని ప్రశ్నించారు. తన ఇసుక మాఫియా ధనదాహం కోసం 17 మంది రైతులు మరణిస్తే వారికి మద్దతు తెలపని సుధీర్‌రెడ్డి పెద్ద ఉగ్రవాది అన్నారు. వలంటీర్లపై రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసినందుకు సుధీర్‌రెడ్డిపై ఎన్నికల కమిషనర్ తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

మట్టి నమూనాల సేకరణపై అవగాహన


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారి భారతి

బుచ్చినాయుడుకండ్రిగ: కనమనంబేడు గ్రామంలోని ఏకలవ్య మోడల్ గురుకుల పాఠశాల్లోని విద్యార్థులకు మంగళవారం ఆత్మ, చిత్తూరు వారి ఆధ్వర్యంలో మట్టి నమూనాల సేకరణపై అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా భూసార పరీక్షా కేంద్రం వ్యవసాయాధికారి పుష్పాంజలి మాట్లాడుతూ భూసార పరీక్షల ఆధారంగా పంటలు వేస్తే దిగుబడి పెరుగుతుందని తెలిపారు. మట్టి నమూనాల్లో పోషకాల వివరాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. సహాయ వ్యవసాయ సంచాలకులు లక్ష్మీదేవి, సిబ్బంది ప్రియాంక, భరత్, ప్రిన్సిపల్ దామోదర్‌నాయుడు పాల్గొన్నారు.

వేలంలో పంచాయతీకి రూ.5.18 లక్షలు ఆదాయం


పిచ్చాటూరులో వేలం పాట నిర్వహిస్తున్న అధికారులు

పిచ్చాటూరు: వేలం పాట ద్వారా పిచ్చాటూరు పంచాయతీకి రూ.5.18 లక్షలు ఆదాయం సమకూరినట్లు ఈఓపీఆర్‌డీ శ్రీదేవి తెలిపారు. మంగళవారం స్థానిక పంచాయితీ కార్యాలయంలో బస్టాండు, జంతువధ శాల, దినసరి కూరగాయల మార్కెట్‌లకు వేలం పాట నిర్వహించారు. ఈ వేలం పాట ద్వారా రూ.5.18 లక్షలు ఆదాయం వచ్చినట్లు ఆమె వెల్లడించారు. వేలం దక్కించుకున్న వారు 2024 ఏప్రిల్ 1 నుండి 31 మార్చి 2025 వరకు జంతువధ శాల, దినసరి కూరగాయల మార్కెట్‌పై హక్కులు కలిగి ఉంటారని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాధిక, సిబ్బంది పాల్గొన్నారు.

గడ్డి దగ్ధం


కాలిపోతున్న గడ్డి

ఏర్పేడు : మండలంలోని కుమ్మరికండ్రిగలో మంగళవారం వీరయ్య అనే రైతుకు చెందిన గడ్డి దగ్ధమైంది. వివరాలు.. వీరయ్య తన 4 ఎకరాల్లో వరి సాగు చేశాడు. ఒబ్బిడి పూర్తయిన తర్వాత గడ్డిని మోపులు కట్టి పొలంలోనే నిల్వ చేసుకున్నాడు. ఈ క్రమంలో గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో సుమారు రూ.70వేల విలువైన గడ్డి పూర్తిగా కాలిపోయింది. ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలని బాధిత రైతు కోరుతున్నాడు.

7న ఉగాది కవి సమ్మేళనం

తిరుపతి కల్చరల్: ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని ఏప్రిల్ 7వ తేదీ సాయంత్రం 4.15 గంటలకు ఎమ్మార్‌పల్లెలోని యూత్ హాస్టల్లో కవి సమ్మేళనం నిర్వహించనున్నట్లు జిల్లా రచయితల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సాకం నాగరాజు, మన్నవ గంగాధరప్రసాద్ మంగళవారం తెలిపారు. కవితా పఠనం, విశ్లేషణతోపాటు అతిథుల ప్రసంగం, హాజరైన కవులను సత్కరించినున్నట్లు వెల్లడించారు.

అందరికీ మేలు చేశాం.. ఆశీర్వదించండి

- జగనన్న పాలనలో హామీలన్నీ నెరవేర్చాం
- అత్యధిక మెజారిటీతో గెలిపించాలని పిలుపు
- వైఎస్సార్‌సీపీ సత్యవేడు ఎమ్మెల్యే అభ్యర్థి నూకతోటి రాజేష్


ఎన్నికల ప్రచారంలో భాగంగా కరపత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి నూకతోటి రాజేష్

బుచ్చినాయుడుకండ్రిగ: సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి 2019 ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను సంపూర్ణంగా నెరవేర్చారని, వచ్చే ఎన్నికల్లో వైఎస్ఆర్ సీపీని గెలిపించి మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేసుకోవాలని సత్యవేడు ఎమ్మెల్యే అభ్యర్థి నూకతోటి రాజేష్ పిలుపునిచ్చారు. ఆయన మంగళవారం మండలంలోని నీర్పాకోట, కాంపాళ్లెం, గాజులపెళ్లూరు, కుక్కంబాకం గ్రామాల్లో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఆయనకు ప్రజలు బ్రహ్మరథం పట్టారు. నాయకులు, ప్రజాప్రతినిధులు ఘన స్వాగతం పలికారు. ఇంటింటికి వెళ్లి నవరత్నాల కరపత్రాలను అందజేసి ఓటు వేసి, గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న సంక్షేమ పాలన మళ్లీ కొనసాగాలంటే ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ప్రజలందరూ ఆశీర్వదించాలని తెలిపారు. సంక్షేమాభివృద్ధిలో రాష్ట్ర ప్రజలకు అన్ని విధాలుగా మేలు చేకూర్చిన ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. పేదలకు ఆరోగ్యశ్రీ ద్వారా ప్రతి గడపలో ఆరోగ్యంతోపాటు సంక్షేమం కోసం నవరత్నాలను అమలు చేశారని తెలిపారు. అధికారం కోసం మాటలు చెప్పడం తర్వాత మోసం చేయడం టీడీపీ నేత చంద్రబాబు నైజమని విమర్శించారు. ఎమ్మెల్యేగా గెలిపిస్తే ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజాసేవలో నిమగ్నమవుతానని తెలిపారు.

వలంటీర్లపై విమర్శలు తగవు

ప్రజలకు, ప్రభుత్వానికి వారధులుగా వ్యవహరిస్తున్న వలంటీర్లపై శ్రీకాళహస్తి టీడీపీ అభ్యర్థి బొజ్జల సుధీర్ రెడ్డి విమర్శలు చేయడం తగదని నూకతోటి రాజేష్ అన్నారు. కరోనా కష్టకాలంలో ప్రాణాలకు తెగించి, ప్రజలకు సేవలు అందించిన ఘనత వలంటీర్లకే దక్కుతుందని, వృద్ధులకు 1వ తేదీ ఉదయం 5 గంటలకే వారి ఇళ్లకు వెళ్లి పింఛన్ ఇస్తూ, ప్రజల మన్ననలను పొందుతున్నారని తెలిపారు. ప్రజా సేవకులైన వలంటీర్లను విమర్శించడం సమంజసం కాదని, ఎన్నికల్లో బొజ్జల సుధీర్‌రెడ్డికి ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. వైఎస్ఆర్ సీపీ మండల కన్వీనర్ అరణి విద్యానాథరెడ్డి, అరణి సుధాకర్‌రెడ్డి, భానుప్రకాష్‌రెడ్డి, ఎంపీపీ మేకల సుబ్బలక్ష్మి, వైస్ ఎంపీపీ మునికృష్ణారెడ్డి, జొన్నల గోపాల్‌రెడ్డి, మణినాయుడు, గు రునాథం, అజయ్‌కుమార్‌రెడ్డి, గంగయ్య, ఢిల్లీ బాబు, రవి, గురవయ్య, హరిబాబు, కోటేశ్వరా వు, గిరి, తులసీరామ్, కిరణ్‌యాదవ్ పాల్గొన్నారు.

నేడు నూకతోటి రాజేష్ ప్రచారం

నాగలాపురం: మండలంలోని గోలవారి కండ్రిగ, టీపీ పాలెం, టీపీ కోట, బీరకుప్పం, కడివేడు, రాజులకండ్రిగ గ్రామాల్లో బుధవారం ఉదయం 9 నుండి సాయంత్రం 5 గంటల వరకు వైఎస్ఆర్ సీపీ సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్ ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నట్లు మండల అధ్యక్షుడు టి.అపరంజిరాజు తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని ఆయన కోరారు.


నీర్పాకోట గ్రామంలో ర్యాలీ


ప్రజలకు అభివాదం చేస్తున్న నూకతోటి రాజేష్

అర్హులందరికీ సంక్షేమ పథకాలు


మోదుగులపాళెంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న బియ్యపు పవిత్రారెడ్డి

- జగనన్నతోనే పేదల కష్టాలు దూరం
- కూటమిని నమ్మితే మరోసారి మోసం
- బియ్యపు పవిత్రారెడ్డి

ఏర్పేడు : కులాలు..మతాలు.. పార్టీలకు అతీతంగా పేదరికమే ప్రామాణికంగా అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని వైఎస్సార్‌సీపీ రేణిగుంట మండలం ఇన్‌చార్జి బియ్యపు పవిత్రారెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం మండలంలోని మోదుగులపాళెం పంచాయతీ మోదుగులపాళెం, కుమ్మరిమిట్ట, ఎస్సీ, ఎస్టీ కాలనీలో మేమంతా సిద్ధం పేరిట ఎన్నికల ప్రచారం చేపట్టారు. పవిత్రారెడ్డి మాట్లాడుతూ సంక్షేమ పాలన కొనసాగాలంటే జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేసుకోవాలని పిలుపునిచ్చారు. జగనన్న పాలనలోనే పేదలకు కష్టాలు దూరమవుతాయని వెల్లడించారు. పొరబాటున చంద్రబాబు నాయుడు అధికారంలోకి వస్తే మళ్లీ జన్మభూమి కమిటీలను ఏర్పాటు చేసి సంక్షేమ పథకాలు తొలగిస్తారని హెచ్చరించారు. మరోసారి బూటకపు హామీలతో టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు వస్తున్నారని, వారిని నమ్మితే మళ్లీ మోసం చేస్తారని హెచ్చరించారు. ప్రజల ఆర్థిక స్థితిగతులు మరింత మెరుగుపడాలంటే రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ వైఎస్సార్ సీపీకి అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జి గున్నేరి కిషోర్‌రెడ్డి, వైస్ ఎంపీపీలు శ్రీనివాసులు, జనార్దన్‌రెడ్డి, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు నల్లపాలెం శివయ్య, కో–ఆప్షన్ సభ్యుడు బత్తిశెట్టి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు రమణయ్య యాదవ్, సింగిల్‌విండో అధ్యక్షుడు జనార్దన్ యాదవ్, మాజీ అధ్యక్షుడు నాగార్జునరెడ్డి, నాయకులు రాజేంద్రన్, సురేఖ, చెంగయ్య, కృష్ణయ్య, లోకనాథరెడ్డి, సురేఖ, గుణశేఖర్ నాయుడు, రాజశేఖర్‌రెడ్డి, చెంగల్‌రాయులు, రమేష్, యాగయ్య, శ్రీనివాసులు, లక్ష్మీపతి, కేశవులురెడ్డి, మురగయ్య, రాందాసు, రవిచంద్ర పాల్గొన్నారు.

అక్రమ రవాణాపై నిరంతర నిఘా


సమావేశంలో మాట్లాడుతున్న రిటర్నింగ్ అధికారి కేపీ నరసింహులు

సత్యవేడు: ఎన్నికల నేపథ్యంలో అక్రమ రవాణాపై సరిహద్దుల వద్ద నిరంతరం నిఘా ఉండాలని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి కేపీ నరసింహులు(డిప్యూటీ కలెక్టర్, ఏపీఐఐసీ, తిరుపతి) అన్నారు. మంగళవారం పాలిటెక్నిక్ కళాశాలలో ఎన్నికల అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పుత్తూరు డీఎస్పీ శ్రీనివాసులురావు, ట్రైనీ డీఎస్పీ సింధుప్రియ, శ్రీసిటీ డీఎస్పీ జీవీఎస్ పైడేశ్వరరావు పాల్గొన్నారు. ఆంధ్రా–తమిళనాడు సరిహద్దుల చెక్‌పోస్టు సిబ్బంది సమర్థవంతంగా పని చేయాలని సూచించారు. ఇతర రాష్ట్రాల నుంచి మద్యం, డబ్బు, మాదక ద్రవ్యాలు, మారణాయుధాలు రవాణా కాకుండా చూడాలన్నారు. నియోజవర్గంలో ప్రవేశిస్తున్న ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాతే అనుమతించాలని ఆదేశించారు. తహసీల్దారు రామాంజనేయులు, సీఐ దివాకర్‌రెడ్డి, ఎస్ఐ వీరాంజనేయులు, బాలకృష్ణ, ఈశ్వరయ్య, భాస్కర్, రెవెన్యూ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

యథేచ్ఛగా 'కోడ్' ఉల్లంఘన



ఇళ్లకు అంటించిన బొజ్జల సుధీర్‌రెడ్డి స్టిక్కర్లు, బస్సుకు అడ్డంగా పెట్టిన ఆటో

శ్రీకాళహస్తి: ఎన్నికల ప్రవర్తన నియమావళిని టీడీపీ నేతలు యథేచ్ఛగా ఉల్లంఘిస్తున్నారు. కోడ్ అమల్లోకి వచ్చిన నేపథ్యంలో అధికారులు ఎక్కడికక్కడ విగ్రహాలకు ముసుగులు తొడిగారు. వైఎస్సార్‌సీపీ నేతల ఫొటోలు, ఫ్లెక్సీలను తొలగించారు. అయితే టీడీపీ నాయకులు అవేమి పట్టనట్లు ప్రతి ఇంటికీ వెళ్లి 'ఇంటింటికీ మీ బొజ్జల' స్టిక్కర్లను అతికించేస్తున్నారు. కోడ్ తమకు పట్టదన్నట్లు దౌర్జన్యంగా వ్యవహరిస్తున్నారు. బొజ్జల రిషితారెడ్డి సోమవారం తొట్టంబేడు మండలం, మంగళవారం శ్రీకాళహస్తి మండలంలో పర్యటించారు. ఆమె వెళ్లిన ప్రతి ఇంటికీ బొజ్జల స్టిక్కర్ అతికించడంపై పలువురు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. అలాగే దుకాణాలు, రోడ్ల పక్కన గోడలు, కనిపించిన వాహనాలకు సైతం స్టిక్కర్ వేయడం కోడ్ ఉల్లంఘనే అని మండిపడుతున్నారు.

ఆటోవాలా హంగామా

శ్రీకాళహస్తి పట్టణంలోని భేరివారి మండపం వద్ద మంగళవారం బొజ్జల సుధీర్‌రెడ్డి స్టిక్కర్‌తో ఉన్న ఆటోను డ్రైవర్ నడిరోడ్డుపై ఆపేశాడు. వెనుక వచ్చిన ఆర్టీసీ బస్సు ఎంత సేపు హారన్ కొట్టినా తీయలేదు. చుట్టుపక్కల ఉన్న వారు ఆటో పక్కకు తీసుకెళ్లమని చెబితే పూటుగా మద్యం తాగి ఉన్న ఆ డ్రైవర్ దౌర్జన్యానికి దిగాడు. టీడీపీ వారికి భోజనం తీసుకెళుతున్నానని, తాను బయలుదేరే వరకు బస్సును అక్కడే ఆపుకోవాలని దురుసుగా సమాధానమిచ్చాడు. దీంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేయడంతో చల్లగా పలాయనం చిత్తగించాడు.

వైఎస్సార్‌సీపీ మండలస్థాయి అనుబంధ విభాగాలకు అధ్యక్షులు

రేణిగుంట : శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని వివిధ మండలాలకు సంబంధించి అనుబంధ విభాగపు అధ్యక్షులను నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది.

రేణిగుంట మండలం : ఎస్సీ సెల్ అధ్యక్షుడు- తోటి మోహన్‌బాబు, బీసీ సెల్- సి.విశ్వనాథ్‌యాదవ్, యువజన విభాగం- పీడీ దిలీప్, మహిళా విభాగం - పి.బుజ్జమ్మ, మైనారిటీ విభాగం అధ్యక్షుడిగా ఎస్.అబ్దుల్ ఖదీర్‌ను నియమించారు.

శ్రీకాళహస్తి మండలం : ఎస్సీ సెల్ అధ్యక్షుడు- డి.మనోహర్, బీసీ సెల్ - ఎన్.శివకుమార్, యువజన విభాగం- వెంపళ్ల సురేంద్రయాదవ్, మహిళా విభాగం- కె.రాజలక్ష్మి, మైనారిటీ విభాగం అధ్యక్షుడిగా ఎస్‌కే రాహుల్ నియమితులయ్యారు.

ఏర్పేడు మండలం : ఎస్సీ సెల్ అధ్యక్షుడు-టి.రవిచంద్ర, బీసీ సెల్- పి.మునిశేఖర్, యువజన విభాగం- ఎస్.నవీన్ యాదవ్, మహిళా విభాగం- ఎం.సురేఖ, మైనారిటీ విభాగం అధ్యక్షుడిగా సయ్యద్ అబ్దుల్ రెహమన్‌ను నియమించారు.

శ్రీకాళహస్తి టౌన్ : పట్టణ ఎస్సీ సెల్ అధ్యక్షుడు- పసల భార్గవ్, బీసీ సెల్- ఎంఆర్ మురళీయాదవ్, యువజన విభాగం- టి.దామోదర్‌రెడ్డి, మహిళా విభాగం- ఎం.ప్రమీల, మైనారిటీ విభాగం అధ్యక్షుడిగా ఎస్‌కే మహబూబ్‌బాషాను నియమిస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఇన్నేళ్లు పట్టలేదు.. ఇప్పుడు విమర్శలా!


సాయమ్మ ఇల్లు


మాట్లాడుతున్న సాయమ్మ

శ్రీకాళహస్తి : ఏర్పేడులోని కాలువ పక్కన ఓ కుటుంబం సుమారు 20 ఏళ్లగా నివసిస్తోంది. కాలువ అవతలు వారి ఇల్లు ఒకటే ఉండడంతో దారి సౌకర్యం కూడా లేదు. తిరుపతి ఎంపీ ఎన్నికల సమయంలో ప్రచారంలో భాగంగా వారి ఇంటికి వైఎస్సార్‌సీపీ నేత బియ్యపు పవిత్రారెడ్డి వెళ్లారు. సరైన మార్గం లేకపోవడంతో కాలువలో దిగే వారి నివాసానికి వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. దీంతో ఆయన ఇంటి యజమాని సాయమ్మ ఆనందంతో ఉబ్బితబ్బిబ్బైయ్యింది. ఇన్నేళ్లల్లో టీడీపీ వారు తమను అసలు పట్టించుకోలేదని, కనీసం ఓటు అడిగేందుకు కూడా రాలేదని వెల్లడించింది. ఆ సమయంలో పవిత్రారెడ్డి వారి ఇంటి ముందు కాలువపై సిమెంట్ స్తంభాలు వేయించి దారి సౌకర్యం కల్పించారు. అయితే ఈ విషయాన్ని ఇప్పుడే చూసినట్లు ఎల్లోమీడియాలో అసత్య కథనం ప్రచురించారు. ఐదేళ్లు కానరాలేదా అన్నట్లు తప్పుడు వార్తను ముద్రించారు. దీనిపై సాయమ్మ మాట్లాడుతూ ఇప్పడి వరకు తమ అవస్థలు ఎవరికీ పట్టలేదని, ఇప్పుడు తాత్కాలికంగా నడవడానికి దారి ఏర్పాటు చేస్తే విమర్శలు చేస్తున్నారని మండిపడింది.

లైంగికదాడికి యత్నం : కేసు నమోదు

ఏర్పేడు : మండలంలోని వికృతమాలలో ఓ మహిళతో అసభ్యంగా ప్రవర్తించి, లైంగిక దాడికి యత్నించిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు సీఐ శ్రీరామశ్రీనివాసులు మంగళవారం రాత్రి తెలిపారు. గ్రామానికి చెందిన సుహాసిని పుత్తూరు మండలం, వేణుగోపాలపురం గ్రామానికి చెందిన సురేంద్రను తమకు ఇవ్వాల్సిన నగదు అడిగింది. ఈ క్రమంలో మంగళవారం సురేంద్ర వికృతమాలకు వెళ్లి ఆమెను దూషించి, లైంగికదాడికి యత్నించాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ వెల్లడించారు.

భర్తపై వేధింపుల కేసు

మండలంలోని పాపానాయుడుపేటలో ఓ మహిళపై తన భర్త వేధింపులపై ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు సీఐ శ్రీరామశ్రీనివాసులు మంగళవారం రాత్రి తెలిపారు. ప్రసన్న కుమారి వికృతమాల సమీపంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో ఉపాధ్యాయనిగా పని చేస్తోంది. ప్రసన్న కుమారికి రేణిగుంట మండలం, జీవాగ్రంలోని కేఎల్ఎం ఆస్పత్రికి చెందిన జీసీఎస్ సుకుమార్‌కు 13 ఏళ్ల క్రితం వివాహమైంది. దంపతులకు కుమారుడు ఉన్నాడు.జీసీఎస్ సుకుమార్ తొట్టంబేడు మండలంలోని పూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నాడు. నిందితుడికి ప్రసన్న కుమారితో వివాహానికి ముందే మరో యువతితో వివాహమై ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ క్రమంలో విషయం తెలుసుకున్న ప్రసన్న కుమారి అడిగినందుకు ఆమెను ఇటీవల నుంచి తీవ్రంగా వేధించడం ప్రారంభించాడు. దీనిపై బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ వెల్లడించారు.

'సేవా'గ్రహం..!

ఐదేళ్లుగా నిరంతరం ప్రజాసేవలో నిమగ్నం.. కోవిడ్ కష్టాల్లోనూ ప్రాణాలకు తెగించి మహమ్మారితో సమరం.. అవ్వాతాతలకు అండగా నిబద్ధతతో కర్తవ్యం.. ప్రభుత్వానికి ప్రజలకు వారధిగా పయనం .. అనుక్షణం అందరికీ అందుబాటులో ఉంటూ చిత్తశుద్ధితో పనిచేస్తున్న వలంటీర్లపై టీడీపీ నేత బొజ్జల సుధీర్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు బాధాకరం.. సేవే లక్ష్యంగా విధులు నిర్వర్తిస్తున్న వలంటీర్లను ఉగ్రవాదులతో పోల్చడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తం.. అసంబద్ధ ఆరోపణలపై సేవా సైన్యం మండిపడుతోంది. టెర్రరిస్టులు.. స్లీపర్ సెల్స్ అంటూ అవాకులు చెవాకులు పేలడంపై ఆగ్రహం వెలిబుచ్చుతోంది. – శ్రీకాళహస్తి

ప్రాణాలకు తెగించి



నాలుగేళ్ల నుంచి వలంటీరుగా పనిచేస్తున్నా. ప్రజలకు ఏం అవసరమొచ్చినా అప్పట్లో కార్యాలయాల వద్ద పడిగాపులు కాసేవారు. పింఛను కోసం ప్రభుత్వ పాఠశాల వద్ద వేచి ఉండేవారు అయితే మేము వచ్చిన తర్వాత ఉదయాన్నే లబ్ధిదారుల ఇంటికే వెళ్లి నగదు అందిస్తున్నాం. కోవిడ్ సమయంలో సుధీర్‌రెడ్డి హైదరాబాదులో ఉన్నారు. మేం ప్రాణాలకు తెగించి ప్రజలకు సేవచేశాం. మమ్మల్ని ఉగ్రవాదులు అనడం దారుణం. – మునీర్

బిడ్డల్లా పనిచేశాం



మాకు ఇచ్చిన క్లస్టర్‌లో ప్రతి ఇంటికి ఏ అవసరమొచ్చినా వారి వారి బిడ్డలా పనిచేశాం. వారికి కావాల్సిన ప్రభుత్వ పథకాలు అన్ని అర్హతను బట్టి సక్రమంగా సకాలంలో అందించాం. బిడ్డలు ఎలా అయితే ఓ ఇంటికి పనిచేస్తారో మేము అలా సేవలు అందించాం. అలాంటి మాపై ఇలాంటి వ్యాఖ్యలు చేయడం బాధకలిగించింది. ఇలా రెచ్చగొట్టే వ్యాఖ్యలను చేయడం మంచిదికాదు. – బాషా

పథకాలను ఇంటికే చేర్చాం



గతంలో ప్రభుత్వాలు ఎన్నో పథకాలు అమలు చేశాయి. అయితే ఆ పథకాల కోసం ప్రజలు కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వచ్చేంది. మా వలంటీర్ వ్యవస్థ వచ్చిన తర్వాత లబ్ధిదారుల ఇంటికే సంక్షేమ పథకాలను చేర్చాం. అలాంటి మమ్మల్ని స్లీపర్ సెల్స్, టెర్రరిస్టులు అనడం బాధాకరం. – మునిరత్నం

పార్టీలకు అతీతంగా..



ప్రతి నెలా ఉదయం 7గంటలకే పింఛను ఇచ్చి అవ్వాతాతల కళ్లలో ఆనందం చూశాం. పింఛనుకోసం రామాలయాలు, పాఠశాలల వద్ద పడిగాపులు పడే పరిస్థితి తప్పించాం. అలా కాకుండా ఇంటికే పింఛను అందిస్తుండటంతో వృద్ధులు, వికలాంగులు ఆశీర్వదించేవారు. అలాంటి మాపై టెర్రరిస్టులు, జిహాదీలు, డేటా చోరీ చేస్తున్నామని బొజ్జల సుధీర్‌రెడ్డి అనడం దుర్మార్గం. పార్టీలు, మతాలు, కులాలకు అతీతంగా సేవ చేశాం. – నజీర్

టేక్ హోమ్ రేషన్ ఇవ్వాల్సిందే..

తిరుపతి అర్బన్: గర్భిణీలు, బాలింతలకు క్రమం తప్పకుండా టేక్ హోమ్ రేషన్ ఇవ్వాలని జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారి జయలక్ష్మి తెలిపారు. మంగళవారం తన చాంబర్ నుంచి ఆమె మాట్లాడుతూ ప్రతి నెల మొదటి వారంలో వంద శాతం టేక్ హోమ్ రేషన్ పంపిణీ చేయాలని వెల్లడించారు. జిల్లాలో 12,750 మంది గర్భిణీలు, 11,509 బాలింతలు, 1,13,202 మంది చిన్న పిల్లలు(0–6 ఏళ్లు) ఉన్నారని చెప్పారు. 2492 అంగన్‌వాడీ సెంటర్లలో 2090 అంగన్‌వాడీ టీచర్లు, 348 మినీ అంగన్‌వాడీ టీచర్లు, 2066 మంది హెల్పర్లు పని చేస్తున్నారని వివరించారు. ప్రతి నెలా 15 రోజులకు ఒకసారి పంపిణీ చేస్తున్న టేక్ హోం రేషన్‌కు సంబంధించి మొదటి వారం, మూడో వారంలో వంద శాతం అందజేయాలని తెలియజేశారు. అంతేకాకుండా పంపిణీకి సంబంధించి ఆయా సీడీపీవోలు, అంగన్‌వాడీ టీచర్లు టేక్ హోమ్ రేషన్ పంపిణీ కార్యక్రమాన్ని పర్యావేక్షించాలని స్పష్టం చేశారు.

స్మార్ట్ సిటీ పనుల పురోగతిపై సమీక్ష

తిరుపతి తుడా: తిరుపతి స్మార్ట్ సిటీ ఆధ్వర్యంలో చేపట్టిన అభివృద్ధి పనుల పురోగతిపై ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ అదితిసింగ్ సమీక్షించారు. కార్పొరేషన్ కార్యాలయంలో మంగళవారం స్మార్ట్ సిటీ అధికారులు, ఇంజినీర్లు, కాంట్రాక్టర్లతో తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అదితి సింగ్ సమావేశమయ్యారు. ఆమె అధికారులతో మాట్లాడుతూ మున్సిపల్ కార్పొరేషన్ నూతన భవన పనులు చాలా నెమ్మదిగా నడుస్తున్నాయని, పనులు వేగవంతం చేయాలని సూచించారు. మల్టీ లెవల్ కార్ పార్కింగ్ పనులు, ఇతర పనుల స్థితిగతులపై చర్చించి పనుల వేగవంతానికి కాంట్రాక్టర్లు పని చేయాలని, నిర్మాణాల పనులపై అధికారులు దృష్టి సారించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో సూపరింటెండెంట్ ఇంజనీర్ తిరుమాలిక మోహన్, మున్సిపల్ ఇంజినీర్ చంద్రశేఖర్, డీఈఈ విజయకుమార్‌రెడ్డి, ఏఐకాం సంస్థ ప్రతినిధి బాలాజీ పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు


మాట్లాడుతున్న తిరుపతి ఆర్డీఓ నిషాంత్‌రెడ్డి

తిరుపతి అర్బన్: సార్వత్రిక ఎన్నికల నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని చంద్రగిరి ఈఆర్వో, తిరుపతి ఆర్డీఓ నిషాంత్‌రెడ్డి వెల్లడించారు. మంగళవారం తిరుపతి ఆర్డీఓ కార్యాలయంలో ఆయన రాజకీయ పార్టీ నేతల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఆదేశాలను అంతా పాటించాలని స్పష్టం చేశారు.